# గ్రామ న్యాయాలయ చట్టం- 2008

సమానత్వం, న్యాయం.. ఆధునిక, ప్రజాస్వామ్య భారతదేశ ప్రధాన లక్ష్యాలు. హేతుబద్ధమైన న్యాయ వ్యవస్థ ద్వారా ఈ రెండు లక్ష్యాలను సాధించవచ్చు. దురదృష్టవశాత్తు భారతదేశంలోని న్యాయవ్యవస్థ పలు వ్యవస్థాపర సమస్యలను ఎదుర్కొంటోంది. అవినీతి, జాప్యం, ఖరీదైపోతున్న న్యాయసేవలు, పరిమిత న్యాయ సహాయం, సుశిక్షితులైన న్యాయవాదులు, న్యాయమూర్తులు అందుబాటులో లేకపోవడం వంటి సవాళ్లు సగటు భారతీయ పౌరుడిని వేధిస్తున్న భయాలు. అక్టోబర్ 2, 2009 నుంచి అమల్లోకి వచ్చిన న్యాయ పంచాయత్‌లు ప్రజలకు భాగస్వామ్యం కల్పిస్తూ, మధ్యవర్తిత్వం, రాజీ పద్ధతుల ద్వారా న్యాయాన్ని అందించడానికి ఉద్దేశించినవి. భౌగోళికంగా, మానసికంగా ప్రజలకు అందుబాటులో ఉండే ఈ న్యాయ పంచాయత్‌లు ప్రజల విలువైన సమయాన్ని పరిరక్షిస్తూ, తక్కువ ఖర్చుతో సాక్షులకు, కక్షిదారులకు అందుబాటులో ఉంటాయి. న్యాయవ్యవస్థ పని భారాన్ని కూడా తగ్గిస్తాయి.

భారతీయ న్యాయవ్యవస్థలో గ్రామ న్యాయాలయాలు అధునాతన సంస్కరణలు. సత్వర న్యాయస్థానాలు(ఫాస్ట్‌ట్రాక్ కోర్ట్స్), లోక్ అదాలత్‌లు న్యాయస్థానాల్లో పేరుకుపోతున్న లక్షలాది కేసుల పరిష్కారానికి ఉద్దేశించినవి. గ్రామ న్యాయాలయాలు.. గ్రామీణ ప్రజల విశ్వాసాన్ని చూరగొంటాయనే భావన వ్యక్తమవుతోంది. ఈ చట్టం ప్రకారం దేశ వ్యాప్తంగా 5,067 గ్రామ న్యాయాలయాలు ఏర్పాటవుతాయి. దీని ముఖ్య ఆశయం భారత పౌరునికి సమాన అవకాశాలు అనుభవించడంలో..సామాజిక, ఆర్థిక, మరే ఇతర అవరోధాలు అడ్డంకి కారాదు. రాజస్థాన్‌లోని బస్సి పట్టణం(జైపూర్ సమీపం)లో మొట్టమొదటి గ్రామ న్యాయాలయం ప్రారంభమైంది. ఇప్పటికి నాలుగు రాష్ట్రాల్లో దాదాపు 100 గ్రామ న్యాయాలయాలు పని చేస్తున్నాయి.

గ్రామ న్యాయాలయాలను ఏర్పాటు చేయాలని 1986లో 114వ న్యాయ కమిషన్ సూచించింది. దీని సిఫారసుల ప్రకారం.. ఇది త్రిసభ్య వ్యవస్థ. ఒక న్యాయమూర్తి, మరో ఇద్దరు గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యావంతులు ఉంటారు. తద్వారా భాగస్వామ్యాన్ని అందించవచ్చని అభిప్రాయపడింది. అయితే ప్రస్తుతం అమల్లోకి వచ్చిన చట్టంలో గ్రామీణ ప్రాంత వ్యక్తులకు సభ్యత్వం లేదు.

## ప్రస్తుత చట్టంలోని ప్రధానాంశాలు:

- గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ ఖర్చుతో ప్రజల ముగింట న్యాయాన్ని అందించడం.
- గ్రామ న్యాయాధికారిని హైకోర్టు ఆమోదం మేరకు రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. మొదటి తరగతి మెజిస్ట్రేట్ హోదా కలిగుంటారు.
- ప్రతి మండల పంచాయత్‌కు ఒక గ్రామ న్యాయాలయం ఏర్పాటవుతుంది. మండల పంచాయతి/పంచాయతిసమితి లేని చోట, కొన్ని గ్రామ పంచాయత్‌లకు కలిపి ఒక గ్రామ న్యాయాలయాన్ని స్థాపిస్తారు.



- గ్రామ న్యాయాలయం సంచార న్యాయాలయంగా కూడా పని చేస్తుంది. సివిల్, క్రిమినల్ కోర్టుల అధికారం కలిగి ఉంటుంది.
- మండల పంచాయతి ప్రధాన కార్యాలయం ఉండే గ్రామంలో గ్రామ న్యాయాలయ కార్యాలయం ఉంటుంది. దీని కేంద్రంగా తన పరిధిలోని మిగతా గ్రామాలను సందర్శించి కేసులను పరిష్కరిస్తుంది.
- ఈ చట్టంలోని మొదటి, రెండో షెడ్యూల్‌లో ప్రస్తావించిన సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరిస్తుంది.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పైన పేర్కొన్న షెడ్యూళ్లను సవరించే అధికారం ఉంటుంది.
- వీలైనంతవరకు కక్షిదారులకు అవగాహన కల్పించి, పరస్పర అంగీకారంతో వివాదాన్ని పరిష్కరించడానికి ప్రయత్నిస్తుంది. మధ్యవర్తుల ద్వారా పరిష్కార మార్గాన్ని కనుక్కొంటుంది.
- గ్రామ న్యాయాలయం ఇచ్చిన తీర్పును డిక్రీగా పరిగణిస్తారు. దీని అమల్లో జాప్యాన్ని నివారించడానికి సమ్మరీ ప్రవృత్తిని అనుసరిస్తుంది.
- సహజ న్యాయాన్ని, హైకోర్టు రూపొందించిన నిబంధనలను దృష్టిలో పెట్టుకుని గ్రామ న్యాయాలయం తీర్పు ఇస్తుంది. 1872-భారతీయ ఆధార చట్టం నిబంధనలను పాటించనక్కర్లేదు.
- క్రిమినల్ కేసుల్లో ఇచ్చిన తీర్పుమీద సెషన్స్ కోర్టుకు (తీర్పు ఇచ్చిన ఆర్నెలలోపు) అప్పీల్ చేసుకోవచ్చు.
- సివిల్ కేసుల్లో దీని తీర్పును సవాల్ చేస్తూ ఆరు నెలల్లోపు జిల్లా కోర్టుకు అప్పీల్ చేసుకోవచ్చు.
- అభియోగానికి గురైన వ్యక్తి న్యాయ ప్రక్రియతో సహకరించి శిక్ష తగ్గింపునకు బేరమాడవచ్చు.

ఈ చట్టం జమ్ము-కాశ్మీర్, నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, ఆదివాసి ప్రాంతాలు మినహా దేశమంతటా వర్తిస్తుంది. అనవసర జాప్యాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో విచారణ పూర్తి కాగానే లేదా పూర్తయిన 15 రోజుల్లోపు తీర్పు ఇవ్వాలి. కక్షిదారులకు ఉచితంగా తీర్పు ప్రతినివ్వాలి. కోర్టు వ్యవహారాలను సంబంధిత రాష్ట్ర అధికార

SAKSHI

భాషలో (ఇంగ్లిష్ సహా) నిర్వహించాలి. సామాజిక కార్యకర్తలను మధ్యవర్తులుగా నియమించాలి. వారి నియామకం విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి.

### పరిమితులు:

ఉన్నతాశయంతో ఈ చట్టాన్ని రూపొందించినప్పటికీ ఆచరణలో పేద ప్రజలకు న్యాయం అందకపోవచ్చనేది కొందరు న్యాయ నిపుణుల అభిప్రాయం.

### గ్రామ న్యాయాలయ పరిధిలోకి వచ్చే నేరాల స్వభావం:

ఒకటో షెడ్యూల్‌లో ప్రస్తావించిన క్రిమినల్ అంశాలు.. దొంగతనం; కప్పిపుచ్చడం; దొంగ సొమ్మును కొనడం– అమ్మడం; ఉద్దేశపూర్వకంగా ఇతరులను అవమానించడం; తద్వారా శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం. మరణశిక్ష, ఆజన్మాంత కారాగారవాసం, రెండేళ్లకుపైగా జైలు శిక్షకు కారణమయ్యే నేరాలు మినహాయిస్తే మిగతా నేరాలన్నీ దీని పరిధిలోకి వస్తాయి. అలాగే రెండో షెడ్యూల్ పరిధిలోకి కొన్ని చట్టాలు.. వాటి ఉల్లంఘన వల్ల విధించే శిక్షలను తెచ్చారు.

**ఉదాహరణ:** వేతనాల చెల్లింపు చట్టం, 1936; కనీస వేతన చట్టం 1948; పౌర హక్కుల పరిరక్షణ చట్టం, 1955; వెట్టి చాకిరీ నిషేధ చట్టం, 1976; సమానపనికి, సమాన వేతన చట్టం, 1976; మహిళల గృహ హింస నిరోధ చట్టం, 2005. ఆస్తికి సంబంధించిన వివాదాలు కూడా దీని పరిధిలోకి వస్తాయి.

ఇవన్నీ పేద ప్రజల ప్రయోజనాలను ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. ఇవి సాంఘిక సంక్షేమానికి సంబంధించిన చట్టాలు. వీటిని అన్వయించి, వివాదాలను పరిష్కరించడానికి ఎంతో అనుభవం, పరిజ్ఞానం అవసరం. అయితే ఈ చట్టం ఇలాంటి సున్నితమైన కేసులు విచారించడానికి స్పష్టమైన ప్రక్రియ సూచించలేదు.

### పరిమిత అప్పీలు అవకాశాలు:

ఈ చట్టంలోని 33వ సెక్షన్ ప్రకారం గ్రామ న్యాయాలయం ఇచ్చిన తీర్పును, శిక్షను, ఉత్తర్వును సవాల్ చేస్తూ ఎగువ న్యాయ స్థానానికి సాధారణ పరిస్థితుల్లో అప్పీలు చేసుకునే వీలు లేదు. విధించిన జరిమానా ' వేయికి మించకున్నా, కక్షిదారుల ఆమోదం మేరకు రాజీ కుదిరినా అప్పీలుకు అవకాశం లేదు. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో సెషన్స్ కోర్టుకు, జిల్లా కోర్టుకు అప్పీలు చేసుకోవచ్చు. సంబంధిత కేసు అప్పీలుకు అర్హమా? కాదా? అనే విషయాన్ని గ్రామ న్యాయాధికారి తాను తీర్పు ఇచ్చిన ఆరునెలల్లోపు నిర్ణయించాలి. సెషన్స్, జిల్లా కోర్టులు ఇచ్చిన తీర్పును ఎగువ న్యాయస్థానంలో ప్రశ్నించే వీలు లేదు. అయితే రాజ్యాంగ ప్రకరణలు 32, 226 ప్రకారం ప్రాథమిక హక్కుల పరిరక్షణ కింద ఉన్నత న్యాయస్థానాలకు అప్పీలు చేసుకోవచ్చు.

గ్రామ న్యాయాలయం ఇచ్చిన తీర్పును ఉన్నత న్యాయస్థానంలో సవాలు చేయడానికి ఇచ్చిన గడువు కూడా అభ్యంతరకమైనదే. సెక్షన్ 33(4) ప్రకారం తీర్పు వెలువడిన 30 రోజుల్లోపు అప్పీలు చేసుకోవాలి. ఇది సివిల్ క్రిమినల్ శిక్షా స్మృతికి విరుద్ధం. గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు ఈ పరిమితులన్నీ అర్థం కావు. వారి స్పందన అంతంతమాత్రమే.

### క్లుప్త ప్రక్రియ, బేరమాడు ఒప్పుకోలు (Summary procedure and plea bargaining):

క్రిమినల్ కేసుల విషయంలో గ్రామ న్యాయాలయం క్లుప్త ప్రక్రియను అవలంబిస్తుంది. అంటే వాదోపవాదాలు క్లుప్తంగా విని ప్రాసిక్యూషన్ సమర్పించిన వివరణ/ఆధారాల ప్రాతిపదికగా తీర్పు నివ్వడం. ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, చిల్లర దొంగతనాలు తదితర సాధారణ క్రిమినల్ కేసుల విచారణలో అవలంబించే ప్రక్రియ. ఇది సమయాన్ని ఆదా చేస్తుంది. బేరమాడు ఒప్పుకోలు పద్ధతిలో నేరాభియోగానికి గురైన వ్యక్తి ప్రాసిక్యూటర్‌తో సహకరించకుండానికి అంగీకరించడం, ప్రాసిక్యూషన్ దానికి ప్రతిఫలంగా సాధారణ నిబంధనల కింద కేసు నమోదు చేసి స్వల్పతర శిక్ష విధించడానికి ఒప్పుకోవడం.

ఈ ప్రక్రియ కేసు విచారణను వేగవంతం చేయడానికి, అభియోగానికి గురైన వారినుంచి కీలక సమాచారాన్ని పొందడానికి అవకాశం కల్పిస్తుంది. ఈ రెండు పద్ధతులు నేర శిక్షా స్మృతికి విరుద్ధం. పైగా ఒకవైపు 20వ సెక్షన్ ప్రకారం బేరమాడు ఒప్పుకోలు పద్ధతికి అవకాశాన్ని కల్పిస్తూ.. మరోవైపు 32(2) సెక్షన్ కింద నేరస్తుడు తాను చేసిన నేరాన్ని ఒప్పుకున్నాక, దాని ప్రాతిపదికగా శిక్ష విధించాక, బేరమాడు ఒప్పుకోలు పద్ధతి అనుమతించకపోవడం.

154వ న్యాయ కమిషన్ అభిప్రాయపడినట్లు.. నేరస్థుడు ప్రాసిక్యూషన్‌తో ఒప్పందానికి వచ్చినప్పుడు ఎక్కువ సందర్భాల్లో ప్రాసిక్యూషన్ విధించిన షరతులకు నేరస్థుడు తలొంచడం జరుగుతుంది. నేరస్థునికి న్యాయం లభించే అవకాశం ఉండదు.

142వ న్యాయ కమిషన్ సిఫారసు చేసినట్లు.. సమర్థ అధికారం (Competent authority) సమక్షంలో ప్రాసిక్యూషన్‌తో ఒప్పందానికి రావడం అవసరం. సమర్థ అధికారం అంటే..మెట్రోపాలిటన్ న్యాయమూర్తి/ మొదటి తరగతి మేజిస్ట్రేట్/ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి. దురదృష్టవశాత్తు గ్రామన్యాయాలయ చట్టం అలాంటి అవకాశం కల్పించలేదు.

### న్యాయ ప్రయోజనాలు:

24(7) సెక్షన్ ప్రకారం 'న్యాయప్రక్రియ' 'వీలైనంతవరకు' న్యాయ ప్రయోజనాలకు అనుగుణంగా ఉండాలి. 'వీలైనంతవరకు' అనే పదాన్ని దుర్వినియోగం పరిచే అవకాశం ఉంది. అన్ని సందర్భాల్లో న్యాయప్రక్రియ న్యాయ ప్రయోజనాలకు అనుగుణంగా ఉండాలి. లేనప్పుడు అది అన్యాయమవుతుంది.

### పోలీస్ యంత్రాంగం సహకారం:

SAKSHI

గ్రామ న్యాయాలయ అధికారి తన పరిధిలో పని చేస్తున్న పోలీసు అధికారుల సహకారాన్ని పొందొచ్చు. అయితే పోలీసుల వ్యవహార శైలిపై సమాజంలో ఎన్నో అపోహలున్న విషయం తెలిసిందే. విద్యుత్ లోక్ అదాలత్‌లు నిర్వహించినప్పుడు ఎక్కువ సందర్భాల్లో విద్యుత్ సరఫరా చేసే కంపెనీ ప్రయోజనాలకనుగుణంగా పోలీసులు వ్యవహరించడం, వినియోగదారుల ప్రయోజనాలు దెబ్బతినడం మనందరికి తెలిసిందే. ఈ చట్టం ప్రకారం అప్పీలు చేసుకునే అవకాశం పరిమితం కనుక పోలీసు సహకారం మేలుకు బదులు కీడీ చేసే ప్రమాదం ఉంది.

### ముగింపు:

వివాదాల పరిష్కారం కేవలం శాంతిభద్రతల నిర్వహణ, ప్రైవేట్ వ్యక్తుల ప్రయోజనాల పరిరక్షణకు పరిమితం కాకూడదు. రాజ్యాంగ విలువలకు ప్రాధాన్యతనిస్తూ న్యాయాన్ని పరిరక్షించడం ప్రధాన లక్ష్యం కావాలి. కేవలం గ్రామీణ ప్రాంత వివాదాల పరిష్కార ఉద్దేశంతో పరిమిత ప్రక్రియ హామీలతో (limited procedural guarantees) బడుగు జీవుల ప్రాథమిక హక్కులను ప్రభావితం చేసే.. కనీస వేతన చట్టం, పౌర హక్కులు, కట్టుబానిసత్వ నిషేధం, సమాన పనికి సమాన వేతనం వంటి చట్టాలకు అర్థ వివరణనిచ్చే ప్రక్రియలో రాజ్యాంగ విలువలను పక్కకు పెట్టే ప్రమాదం ఉంది. గ్రామ న్యాయాలయ చట్టం వివాద పరిష్కార మూల స్థంభాన్ని అపహాస్యం చేస్తున్నట్లనిపిస్తుంది.

SAKSHI